సాక్షి గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

శుక్రవారం | 21 | జూలై | 2023



పోలీస్ అధికారుల బదిలీ
అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వరంగల్ కమిషనరేట్ పరిధిలో గురువారం రాత్రి పలువురు ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్ల బదిలీలు అయ్యాయి. - 8లో



అప్రమత్తంగా ఉండాలి
వరుస వర్షాలతో ఉమ్మడిజిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సూచించారు. - 8లో

గరిష్టం/కనిష్టం
29^0 /25^0

వాతావరణం
ఉపరితల ఆవర్తనంతో జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురవనున్నాయి. బలమైన ఈదురు గాలులు వీస్తాయి. సాయంత్రం చల్లాగా ఉంటుంది.

న్యూస్‌రీల్

జెడ్పీ సమావేశం వాయిదా

హన్మకొండ: వరంగల్ అర్బన్ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. గురువారం ఉదయం 10.30 గంటలకు జెడ్పీ చైర్మన్ డాక్టర్ మారపల్లి సుధీర్‌కుమార్ అధ్యక్షతన వరంగల్ అర్బన్ జెడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసమయానికి జెడ్పీటీసీ సభ్యులు హాజరు కాలేదు. తర్వాత 45 నిమిషాలు ఎదురుచూసి ఉదయం 11.15 గంటలకు సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్ ప్రకటించారు. కాగా.. ఆయా శాఖల అధికారులు సమావేశంలో పాల్గొనేందుకు వచ్చి సభ వాయిదా పడడంతో వెనుదిరిగారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

నేరాల మూలాలు ఛేదించాలి

సీపీ ఏవీ.రంగనాథ్



వరంగల్ క్రైం: నేరాలను నియంత్రించాలంటే వాటి మూలాలను ఛేదించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్ పిలుపునిచ్చారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఆర్గనైజ్డ్ నేరాలను నియంత్రించడంలో కీలకంగా నిలుస్తున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులకు బుధవారం రాత్రి సీపీ రివార్డులు అందించారు. ఈసందర్భంగా సీపీ రంగనాథ్ మాట్లాడుతూ.. టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆర్గనైజ్డ్ నేరాలను నియంత్రించడంతో పాటు రికార్డు స్థాయిలో నాసిరకం విత్తనాలు పట్టుకున్నారని ఆయన తెలిపారు. క్రికెట్ బెట్టింగ్, నకిలీ జీపీఏ, లింగనిర్ధారణ పరీక్షలు, గంజాయి అక్రమ రవాణా తదితర కేసులను ఛేదించడంతో పాటు నిందితులను అరెస్ట్ చేయడంలో కీలకంగా పని చేశారని ఆయన పేర్కొన్నారు. సీపీ నుంచి రివార్డులు అందుకున్న వారిలో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి, ఏసీపీ జనార్దన్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్‌రావు, రాంబాబు, సత్యనారాయణ, ఎస్సైలు లవణ్‌కుమార్, దేవేందర్, నిస్సార్, రాజు, శరత్, ఫణీందర్, చందర్, ఏఎఓ సల్మాన్‌పాషా, టాస్క్‌ఫోర్స్ హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు ఉన్నారు.

నల్లబ్యాడ్జీలతో వైద్య విద్యార్థుల నిరసన



ఎంజీఎం: రాష్ట్ర ప్రభుత్వం క్వాక్స్ పేరుతో ఆర్ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇచ్చి వైద్యం ఇవ్వడానికి అనుమతించే విధానాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని జూనియర్ డాక్టర్స్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ.. గురువారం వైద్యవిద్యార్థులు ఎంజీఎం ఆస్పత్రి, కేఎంసీలో నల్లబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వర్తిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. అర్హతలేని వైద్యులతో పేద ప్రజలకు చికిత్సలు అందించడం వల్ల వారి ప్రాణాలకే ప్రమాదముంటుందని పేర్కొంటున్నారు. ఎంతో మంది వైద్యవిద్యార్థులు, వైద్యులు ఉండగా.. అర్హత లేని వారికి శిక్షణ ఇచ్చి వైద్యసేవలు అందించాల్సిన అవసరం ఏం ఉందని ప్రశ్నించారు. ఇందులో జూనియర్ డాక్టర్ల ప్రతినిధులు, వైద్య విద్యార్థులున్నారు.

చిరుధాన్యాల ఉత్పత్తులపై శిక్షణ

కరీమాబాద్: మామునూరు కేవీకేలో చిరుధాన్యాల ఉత్పత్తులపై శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పులిహోర, రాగి లడ్డు, రాగి జావ, జొన్న ఉప్మా, జొన్న కిచిడీ తయారీ విధానం గురించి అంగన్‌వాడీ టీచర్లు, మహిళా రైతులకు గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ అరుణజ్యోతి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి శారద మాట్లాడుతూ చిరుధాన్యాలతో చేసిన ఆహార పదార్థాల్లో అనేక పోషకాలుంటాయని తెలిపారు. కార్యక్రమంలో సీడీపీఓలు విశ్వజ, శ్రీలత, డాక్టర్ సౌమ్య పాల్గొన్నారు.

బోనాల పండుగకు ఎమ్మెల్సీ కవితకు ఆహ్వానం



హన్మకొండ: వడ్డెపల్లిలో జరగనున్న పోచమ్మ బోనాల పండుగకు హాజరు కావాలని భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ ఆహ్వానించారు. ఈమేరకు హైదరాబాద్‌లోని స్వగృహంలో కవితను గురువారం కలిసి శ్రావణమాసం చివరి ఆదివారం వడ్డెపల్లిలో పోచమ్మ బోనాల పండుగ జరుగుతుందని తెలిపారు.

రూ.10లక్షలు పాయె.. బదిలీ కాకపాయె!

అయోమయంలో ఆ.. ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు

- మ్యూచువల్ బదిలీకి నియోజకవర్గ ప్రజాప్రతినిధికి చెరో రూ.10 లక్షలు సమర్పణ
- సిఫార్సు లేఖతో సీపీని కలిసిన ఇన్‌స్పెక్టర్లు..
- మారిన రాజకీయ సమీకరణాలతో నో చెప్పిన సీపీ



వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేయాలనే దృఢ నిశ్చయంతో ఉన్న ఇద్దరు ఇన్‌స్పెక్టర్లకు చుక్కెదురైంది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీస్‌శాఖలో బదిలీలు ముమ్మరమయ్యాయి. తాము కూడా ఎన్నికల ఎఫెక్ట్ బదిలీలో ఉంటామని భావించిన ఆ ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు నియోజకవర్గంలోనే మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్‌కు సిద్ధమయ్యారు. ఇద్దరు ఒకే నియోజకవర్గంలో పనిచేస్తున్నందున మ్యూచువల్ బదిలీ ప్రణాళికకు సదరు స్థానిక ముఖ్య ప్రజాప్రతినిధి ఓకే అన్నారు. ఇందుకు ఆ ఇన్‌స్పెక్టర్లు చెరో రూ.10లక్షలు మొత్తం రూ.20 లక్షలు సమర్పించుకున్నట్లు తెలిసింది. ఆతర్వాత ఆ ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు పోస్టింగ్‌లు ఖాయమనుకుని రెట్టింపు ఉత్సాహంతో సదరు ప్రజాప్రతినిధి ఇచ్చిన సిఫార్సు లేఖతో పోలీస్ బాస్‌ను కలిశారు. అసలు ట్విస్ట్ ఇక్కడే మొదలైంది. ఇటీవల ఆ నియోజకవర్గంలో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలు.. ఇతర సమీకరణాల కారణంగా పోలీస్ పోస్టింగ్‌లను సైతం ప్రభుత్వ పెద్దలే నిశితంగా చూస్తుండడం.. దీంతోపాటు ఆ ప్రజాప్రతినిధి 'పెత్తనం' నడవకపోవడంతో మ్యూచువల్ బదిలీకి పోలీస్ బాస్ నో అని చెప్పినట్లు ఆ శాఖ వర్గాల ద్వారా సమాచారం. దీంతో ఆ ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు చేసేది లేక ఒకరి ముఖం ఒకరు చూసుకుని లబోదిబోమని మొత్తుకున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా.. ఆ ఇద్దరు ఇన్‌స్పెక్టర్లపై ఇప్పటికే తీవ్రమైన అవినీతి ఆరోపణలు ఉన్నాయి. వీరిపై ఎస్‌బీ అధికారులు.. సీపీకి నివేదికలను సైతం సమర్పించినట్లు సమాచారం.

తీజ్.. తీన్‌మార్



తీజ్ వేడుకల్లో గిరిజన యువతులతో ఎమ్మెల్యే అరూరి రమేష్

గ్రేటర్ వరంగల్ 65వ డివిజన్ నిరూప్‌నగర్‌లో గురువారం గిరిజన సంస్కృతీ సంప్రదాయాల పండుగ తీజ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే అరూరి రమేశ్ ముఖ్య అతిథిగా పాల్గొని గిరిజన యువతులతో కలిసి నృత్యాలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు దివ్యారాణి, సిరంగి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

- హసన్‌పర్తి

జలమయం



హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ కళాశాల ఎదుట వరద ప్రవాహం

- లోతట్టు కాలనీల్లోకి చేరిన వరద
- రహదారులపై మోకాలి లోతులో నీళ్లు.
- పొంగిపొర్లిన డ్రెయినేజీలు, నాలాలు

వరంగల్ అర్బన్: మహా నగరంలోని ముంపు కాలనీలు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు నిలిచింది. గురువారం ఏకధాటిగా వర్షం కురిసింది. నాలాలు వరదనీటితో పొటెత్తాయి. అంతర్గత డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో వరద నీరు స్తంభించింది.

స్తంభించిన జనజీవనం

- వర్షంతో నగరంలోని రహదారులు, జంక్షన్లు, డ్రెయినేజీల్లో చెరువులను తలపించాయి.
- మురికివాడలు, శివారు కాలనీల్లో అంతర్గత డ్రెయినేజీలు లేకపోవడంతో ఇళ్ల చుట్టూ, ఖాళీ స్థలాల్లో వరద నీరు చేరింది.
- భద్రకాళి బండ్‌ను ఆనుకుని ఉన్న ఎన్టీఆర్ నగర్, సాయినగర్, సంతోషిమాత కాలనీ, గాయత్రి కాలనీ, శివనగర్, మైసయ్యనగర్, చింతల్, సాకరాశికుంట, ఎస్ఆర్ఆర్ తోట, డీకే నగర్, రాజీవ్ గృహ కల్ప ఏరియా, రాజీవ్ కాలనీ, వాంబే కాలనీ, కాశికుంట, లక్ష్మీగణపతి కాలనీ, మధురానగర్, ఎస్ఆర్ నగర్, ఎంహెచ్ఓ నగర్, వీవర్స్ కాలనీ, ఎస్ఆర్‌నగర్, గాంధీనగర్, వెంకటేశ్వర కాలనీ, హనుమకొండలోని సమ్మయ్యనగర్, దీన్ దయాళ్‌నగర్, రామకృష్ణ కాలనీ, గుండ్ల సింగారం, బాపూజీనగర్, సూర్జీత్‌నగర్, ప్రగతినగర్, తదితర కాలనీల్లో కనీస వసతులు కరువయ్యాయి.

నీరు నిలవకుండా చర్యలు చేపట్టండి

క్షేత్రస్థాయిలో గురువారం కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, అధికారుల బృందం పర్యటించింది. హనుమకొండలోని ఫాతిమా జంక్షన్ వద్ద డ్రెయిన్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. బాపూజీనగర్ ప్రాంతంలోని హెచ్‌పీ పెట్రోల్ పంపు ఆవరణలోని డ్రెయినేజీ శాస్త్రీయంగా నిర్మించకపోతే ట్రేడ్ లైసెన్స్ రద్దు చేస్తామని కమిషనర్ యజమానిని హెచ్చరించారు. సమయ్యనగర్ ప్రాంతంలో పాత సామగ్రి దుకాణానికి ట్రేడ్ లైసెన్స్ ఉందో.. లేదో పరిశీలించాలని, ఇదే ప్రాంతంలో మిగిలిన పాత (ఇనుప) సామగ్రికి వేలం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. 4వ డివిజన్ లోటస్ కాలనీలో ఖాళీ ప్లాట్లలో నీరు నిలవడాన్ని గమనించిన కమిషనర్ సదరు యజమానులకు నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈపర్యటనలో కార్పొరేటర్ బొంగు అశోక్, అడిషనల్ కమిషనర్ రవీందర్‌యాదవ్, సీఎంహెచ్ఓ రాజేశ్, బయాలజిస్ట్ మాధవరెడ్డి, డీఎఫ్ఓ శంకర్ లింగం, ఈఈలు రాజయ్య, సంజయ్‌కుమార్, డీఈలు రవికుమార్, సంతోశ్‌బాబు పాల్గొన్నారు.



కాకాజీ కాలనీలో రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు



వరంగల్ స్టేషన్‌రోడ్‌లో.. జలమయం



వరద ప్రభావిత ప్రాంతాలను పర్యవేక్షిస్తున్న కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

శిథిల భవనం | తస్మాత్ జాగ్రత్త!

మూడు రోజులుగా వర్షాలకు నానుతున్న నగరం

- పాతకాలం భవనాలు కూలిపోయే ప్రమాదం
- నగరంలో కూల్చివేయాల్సిన ఇళ్లు 300 పైచిలుకే
- కూల్చివేతపై అధికారుల నాన్చుడి ధోరణి
- ప్రమాదం జరగకముందే మేల్కోవాలంటున్న నగరవాసులు

వరంగల్ అర్బన్: ముసురు పట్టిందంటే చాలు గ్రేటర్ వరంగల్ పరిధిలోని పాత భవనాల్లో ఉండే వారికి, సమీప ఇళ్లవాసులకు దినదినగండమే. వాన నీటిలో తడిసి, గోడలు బలహీనమై కూలే ప్రమాదం ఉంది. గతంలో వర్షాలకు ఇళ్లు కూలి మనుషులు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు అనేకం ఉన్నాయి. వరంగల్ నగరంలోని పాతబస్తీల్లో యాభై ఏళ్లు దాటిన భవంతులు, పెంకుటిళ్లు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. ఆయా ఇళ్లకు నోటీసులు జారీ చేసి, కూల్చివేయాల్సిన బాధ్యత బల్దియా అధికార యంత్రాంగానిది. కానీ నోటీసులు జారీ చేసి ఆ తర్వాత మిన్నకుండిపోవడంతో అవి అలానే ఉండిపోతున్నాయి. వర్షాకాలంలో ఎక్కడో ఒకచోట ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవిస్తోంది. రెండున్నర ఏళ్ల కిందట 908 పాత భవనాలు ఉన్నట్లు బల్దియా టౌన్‌ప్లానింగ్ అధికారులు గుర్తించారు. అందులో పదిశాతం ఇళ్లను కూడా కూల్చివేయలేదు. కానీ ప్రస్తుతం 300పై చిలుకు భవనాలు ఉన్నట్లు లెక్కల్లో పేర్కొనడం గమనార్హం.

ధ్రువీకరణ పత్రం ఎక్కడ?

పురాతన నిర్మాణాలన్నింటినీ కూల్చివేయడం ఒక్కటే పరిష్కారమా? శిథిల దశకు చేరుకున్నవి మినహా మిగిలిన వాటిని పరీక్షల అనంతరం తగిన మరమ్మతుల ద్వారా లోపాలను చాలావరకు సరిదిద్దుకోవచ్చు. ప్రస్తుతం పాత భవనాల మరమ్మతులు అంటే కేవలం రంగులతో పైపై మెరుగులు దిద్దుతున్నారు. గోడల్లో వచ్చిన పగుళ్లను పట్టించుకోవడం లేదు. స్ట్రక్చరల్ సర్టిఫికెట్ జారీ చేయాల్సి ఉంటుంది. కానీ బల్దియా ఇంజనీర్లకు ఆ తీరిక లేదన్న విమర్శలున్నాయి. శిథిల భవనాల విషయంలో నోటీసులు జారీ చేయడంతో మినహా తాము చేయగలిగిందేమీ లేదని ఓ టౌన్ ప్లానింగ్ అధికారి 'సాక్షి'తో వాపోయారు. బలవంతంగా ఖాళీ చేయిద్దామంటే వారికి పునరావాసం కల్పించాల్సి ఉంటుందని, అది తాము చేసే అవకాశం లేదని స్పష్టం చేశారు.



వరంగల్ స్టేషన్‌రోడ్డులోని ఓ బడా హోటల్ ఎదురుగా ఉన్న పాత భవనాలు ఇవి. ఇవి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. వీటిని కూల్చివేయాలని మున్సిపల్ అధికారులు.. సదరు యజమానులకు నోటీసులు కూడా ఇచ్చారు. కానీ వారు స్పందించకపోవడం.. ఆ తర్వాత బల్దియా సిబ్బంది పట్టించుకోకపోవడంతో అలానే ఉన్నాయి.

గతంలో జరిగిన ప్రమాదాలు..

- 2013 సెప్టెంబర్‌లో కాశిబుగ్గలో ఇల్లు కూలి ఒకరు మృతిచెందారు.
- 2014 ఆగస్టులో ఎల్‌బీనగర్‌కు సమీపంలోని నర్సంపేట రోడ్డులోని ప్రహరీ గోడ కూప్పకూలి ఓ వ్యక్తి మృత్యువాతపడ్డారు.
- 2021లో వరంగల్ చౌరస్తాలో పాతకాలం నాటి భవనం కూలడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పాత బస్తీ ఉర్సు ఎస్సీ కాలనీలో పాత గోడ కూలడంతో స్థానికులు భయందోళనకు గురయ్యారు.
- 2022 జూన్‌లో చార్‌బౌళిలో ఇంటిని కూల్చివేస్తుండగా ఇద్దరు మృతిచెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు.
- 2022 జూలైలో మండిబజారులో దశాబ్దాల కిందట నిర్మించిన ఇల్లు కూలిపోయి ఇద్దరు మృత్యువాత పడగా.. మరొకరికి గాయాలయ్యాయి.
- గత మంగళవారం రాత్రి పైడిపల్లిలో పాడుబడిన పెంకుటిల్లు కూలి రావిరాకుల విజయ్ అనే వ్యక్తి చనిపోయాడు.



ఈఫొటో చూడండి. అటు ఇటు కొత్త నిర్మాణాలు.. మధ్యలో పురాతన నిర్మాణం.. దానికింద దుకాణాలు. ఇది వరంగల్ చౌరస్తాలోనిది. శిథిలావస్థకు చేరిన ఈ భవనాన్ని కూల్చివేయాలని నోటీసులు ఇచ్చి సంవత్సరాలు దాటింది. కానీ యజమాని దానిని కూల్చివేయలేదు. ప్రమాదవశాత్తు ఈ భవనం కూలిపోతే అటు, ఇటు ఉన్న దుకాణాలకు ఆస్తినష్టంతోపాటు ప్రాణనష్టం జరిగే అవకాశం లేకపోలేదు.

ఎక్కడెక్కడంటే..

కాజీపేటలోని బాపూజీనగర్, సోమిడి, కాజీపేట దర్గా, రైల్వే క్వార్టర్స్, హనుమకొండలోని మచిలీబజార్, కుమార్‌పల్లి, సుధానగర్, పాత రాయపుర, ఉజిలిబేస్, లష్కర్‌బజార్, పెద్దమ్మగడ్డ, వరంగల్‌లోని మండిబజార్, చార్‌బౌళి, ఎల్లం బజార్, గిర్మాజీపేట, లోతుకుంట, స్టేషన్‌రోడ్డు, పాత చౌరస్తా, జేపీఎన్ రోడ్డు, కరీమాబాద్, ఖమ్మం రోడ్డు, ఉర్సు, రంగశాయిపేట, ఖిలా వరంగల్, శంభునిపేట తదితర ప్రాంతాల్లో ఉన్నాయి. బల్దియా అధికారులు మేల్కొని శిథిల భవనాలను కూల్చివేయాలని నగరవాసులు కోరుతున్నారు.





వరంగల్ : పిన్నావారి వీధిలో శిథిలావస్థకు చేరిన భవనం, ఊడిపోతున్న పై పెచ్చులు



వరంగల్ స్టేషన్ రోడ్‌లోని మహేశ్వరి గార్డెన్ ఎదురుగా పాత భవనం

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించండి



ఏకశిల పార్కు వద్ద ధర్నా చేస్తున్న పెన్షనర్లు

హన్మకొండ అర్బన్: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ తూపురాణి సీతారాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా గురువారం హనుమకొండ, వరంగల్ జిల్లాల పెన్షనర్లు నగరంలోని ఏకశిల పార్కు ఎదుట వర్షంలో తడుస్తూ ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సీతారాం మాట్లాడుతూ.. అన్ని కార్పొరేట్ హాస్పిటళ్లలో పెన్షనర్లకు నగదు రహిత వైద్యం చేయాలని, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. వరంగల్ జిల్లా అధ్యక్షుడు తుమ్మ వీరయ్య మాట్లాడుతూ.. పెన్షనర్లకు ఆదాయపన్ను రద్దు చేయాలని, రైలు, బస్సు చార్జీల్లో సీనియర్ సిటిజెన్లకు రాయితీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం వారు హనుమకొండ అదనపు కలెక్టర్, వరంగల్ కలెక్టర్‌కు మెమొరాండంలు సమర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు బేతి శంకర్ లింగం, సముద్రాల లక్ష్మీనారాయణ, ఎ.విద్యాదేవి, కె.కళ, టి.నరసింహస్వామి, సంపత్‌కుమార్, పరికిపండ్ల వేణు, పి.రత్నం, కె.యాదగిరి, రాజమల్లు, పాల్గొన్నారు.

సౌత్ ఏషియన్ సదస్సులో మేయర్



సదస్సులో మేయర్ సుధారాణి

వరంగల్ అర్బన్: బంగ్లాదేశ్‌లో గురువారం జరిగిన సౌత్ ఏషియన్ దేశాల ప్రతినిధుల సదస్సులో నగర మేయర్ గుండు సుధారాణి హాజరయ్యారు. పారిశుద్ధ్యం, మల, మూత్ర వ్యర్థాల ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎఫ్ఎస్‌టీపీ), 1,107 సీటింగ్ మరుగుదొడ్లు, ఓడీఎఫ్ ప్లస్ ప్లస్ తదితర అంశాలను రౌండ్‌టేబుల్ సమావేశంలో వివరించారు.

పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహం

హన్మకొండ: పండ్ల తోటల సాగును రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. రైతులను పండ్ల తోటల పెంపకం వైపు ఆకర్షితులను చేయడానికి రాయితీ అందిస్తోంది. ఉద్యాన శాఖ, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అనుసంధానంతో పండ్ల తోటల పెంపకాన్ని చేపట్టాలని నిర్ణయించింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో వరంగల్, హనుమకొండ జిల్లాలో 980 ఎకరాల చొప్పున పండ్ల తోటలు పెంచాలని ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖ లక్ష్యంగా నిర్ణయించింది. మామిడి, నిమ్మ, బత్తాయి, జామ, సపోట, ఆయిల్‌పామ్, కొబ్బరి, జీడిమామిడి, ఆపిల్ బేర్, దానిమ్మ, మునగతోపాటు ఇతర తోటలను పెంచవచ్చు. ఈ ఏడాదినుంచి డ్రాగన్ ఫ్రూట్ కూడా చేర్చారు. పండ్ల తోటల పెంపకానికి బిందు సేద్య పరికరాలను రాయితీపై అందిస్తారు. పండ్ల తోటలు పెంచడానికి ఈజీఎస్ జాబ్ కార్డు, నీటి వసతి కలిగి ఉన్న షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, సన్న, చిన్న కారు రైతులు అర్హులు. ప్రతీ రైతుకు 5 ఎకరాల వరకు రాయితీ వర్తిస్తుంది. డ్రాగన్ ఫ్రూట్ సాగు చేసే ప్రతీ రైతుకు 0.5 ఎకరం వరకు రాయితీ ఇస్తారు.

పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం వీడండి

బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా



మాట్లాడుతున్న కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

వరంగల్ అర్బన్: ఆస్తి, నీటి, గార్బేజీ పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం వీడాలని గ్రేటర్ వరంగల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. గురువారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో రెవెన్యూ అధికారులతో పన్ను వసూళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పన్ను వసూళ్ల తీరు ఆశాజనకంగా లేదని, బిల్ కలెక్టర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల వారీగా పన్ను వసూళ్ల లక్ష్యాలు ఛేదించాలన్నారు. ఇందుకు సమన్వయంతో పనిచేయాలన్నారు. గతేడాది నుంచి ఇప్పటివరకు జరిగిన ఆస్తి మార్పిడి సంబంధ సమాచారం అందించాలని ఐటీ మేనేజర్‌ను ఆదేశించారు. టీఎస్–బీపాస్‌లో సూచించినట్లుగా 240 గజాల విస్తీర్ణంపై ఉన్న నిర్మాణాల యాజమాన్యాలు వివిధ అవసరాల నిమిత్తం ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) తప్పనిసరిగా తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ–ఆఫీస్, గ్రీవెన్స్ సంబంధ ఫైళ్ల క్లియరెన్స్‌పై సమీక్షించిన కమిషనర్ ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ అనిసుర్ రషీద్, సిటీ ప్లానర్ వెంకన్న, డిప్యూటీ కమిషనర్లు శ్రీనివాసరెడ్డి, జోనా, ఆర్‌ఓలు, ఆర్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ డెమో తనిఖీ

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ డెమా స్టేషన్ కేంద్రాన్ని (ఈడీసీ) ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్ఓ), కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా తనిఖీ చేశారు. గురువారం బల్దియా ప్రధాన కార్యాలయంలో మిషన్లను పరిశీలించి, పలు సందేహాలు నివృత్తి చేసుకున్నారు. ఓటర్లలో అవగాహన, చైతన్యాన్ని కలిగించేందుకు నమూనా బ్యాలెట్ మిషన్‌తోపాటు వీవీ ప్యాట్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డెమో మెషిన్‌ను ప్రతీ రోజు ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ అడిషనల్ కమిషనర్ అనిసుర్ రషీద్, తహసీల్దార్ ఫణికుమార్, ఎన్నికల డీటీ రవి, ఆర్ఐ జలపతిరెడ్డి, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ వంశీ చౌహాన్, ఈడీసీ బాధ్యులు మహేందర్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

అరుణాచలానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీస్

హన్మకొండ: తమిళనాడులోని అరుణాచలం గిరి ప్రదక్షిణకు టీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీస్ నడుపుతోందని ఆర్టీసీ వరంగల్–1 డిపో మేనేజర్ పి.శ్రీనివాస్ రావు తెలిపారు. ఈ నెల 31న పౌర్ణమి సందర్భంగా గిరి ప్రదర్శనకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం హనుమకొండ జిల్లా బస్ స్టేషన్ నుంచి సూపర్ లగ్జరీ బస్సు సర్వీస్‌ను నడపనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సర్వీస్ నంబర్ 92222 కలిగిన సూపర్ లగ్జరీ బస్సు.. ఈ నెల 30న మధ్యాహ్నం 03.00 గంటలకు హన్మకొండ బస్టాండ్ నుంచి బయలుదేరి.. 31వ తేదీ ఉదయం 6:00 గంటలకు ఆంధ్రప్రదేశ్‌లోని కాణిపాకం చేరుకుంటుందన్నారు. ఇక్కడ విఘ్నేశ్వరుడి దర్శనం అనంతరం మధ్యాహ్నం 1.00 గంటలకు వెల్లూరులోని మహాలక్ష్మి అమ్మవారి దర్శనం అనంతరం సాయంత్రం 7.00 గంటలకు అరుణాచలం చేరుకుంటుందని వివరించారు. అరుణాచలేశ్వర స్వామి గిరి ప్రదక్షిణ పూర్తయిన తర్వాత ఆగస్టు 1వ తేదీన మధ్యాహ్నం అరుణాచలం నుంచి బయలుదేరి 2న ఉదయం జోగులాంబ అమ్మవారి శక్తిపీఠం సన్నిధికి చేరుకుంటుందని తెలిపారు. ఇక్కడ దర్శనానంతరం బయలుదేరి హన్మకొండకు చేరుకుంటుంది వివరించారు. అరుణాచల గిరి ప్రదర్శనను టీఎస్ఆర్టీసీ టూర్ ప్యాకేజీలా అందిస్తోందన్నారు. ఈ ప్యాకేజీ టికెట్ ధర రూ.4200 నిర్ణయించినట్లు తెలిపారు. టీఎస్ ఆర్టీసీ వెబ్‌సైట్, ఆర్టీసీ బుకింగ్ కౌంటర్‌లో రిజర్వేషన్ చేసుకోవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు 9959226047, 7382855492 ఫోన్ నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

చక్కని చదువు..

గ్రామీణులకు వరం.. నవోదయ విద్యాలయం

- 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ఆగస్టు 10వ తేదీ వరకు గడువు
- వచ్చే ఏడాది జనవరి 20వ తేదీన ప్రవేశ పరీక్ష
- సీబీఎస్ఈ సిలబస్‌తో బోధన


జవహర్ నవోదయ విద్యాలయం మామునూర్

న్యూశాయంపేట: గ్రామీణ ప్రాంత విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం.. మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా జవహర్ నవోదయ విద్యాలయాలు ఏర్పాటు చేసింది. ఈ విద్యాలయాల ద్వారా కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అత్యుత్తమ ప్రమాణాలతో విద్యనందిస్తూ గ్రామీణ ప్రాంత విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తోంది. ఇందులో భాగంగా 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు సీబీఎస్ఈ సిలబస్‌తో ఇంగ్లిష్ మీడియంలో పూర్తిగా ఉచిత విద్యనందిస్తూ ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఏకైక వరంగల్ నగర పరిధిలో ఉన్న మామునూర్ జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశానికి 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ప్రవేశ పరీక్షలో 80 మందిని ఎంపిక చేసి వారికి ఉచిత విద్యాబోధనతో పాటు ఉచిత భోజనం, వసతి, యూనిఫాం, పాఠ్యపుస్తకాలు అందించనుంది. కోఎడ్యుకేషన్ ద్వారా బాల, బాలికలకు వేర్వేరు హాస్టళ్లు ఏర్పాటు చేసి విద్యాబోధన చేపడుతోంది.

ప్రవేశానికి అర్హతలు..

ప్రభుత్వ పాఠశాలలు లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 5వ తరగతిలో విద్యనభ్యసిస్తూ ఉండాలి. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధి వరంగల్, హనుమకొండ, జనగామ, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లా వాసులే అయి ఉండాలి. ప్రస్తుతం ఐదో తరగతి చదువుతున్న బాలబాలికలు 01-05-2012 నుంచి 31-07-2014 మధ్య జన్మించి ఉండాలి. ఆన్‌లైన్‌లో పూర్తి వివరాలను తెలుసుకోవచ్చు. పూర్తి వివరాలు చదివిన తరువాతే వాటికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను జతచేసి దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుకు ఆన్‌లైన్-(www.navodaya.gov.in) డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.నవోదయ.జీవోవీ.ఇన్ సమర్పించాలి. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవడానికి వచ్చే నెల (ఆగస్టు, 10వ తేదీ)వరకు గడువుఉంది. 6వ తరగతిలో మొత్తం 80 సీట్లు ఉన్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో వచ్చే ఏడాది జనవరి 20 తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. ఒకేసారి ప్రవేశం పొందిన విద్యార్థులు ఇంటర్ వరకు విద్యాభ్యాసం చేయొచ్చు.

వివిధ కేటగిరీలకు రిజర్వేషన్..

నవోదయ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు రిజర్వేషన్ ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 75 శాతం, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు నిబంధనల ప్రకారం రిజర్వేషన్ కల్పించి ప్రవేశం ఇస్తారు. బాలికలకు 1/3 వంతు సీట్లు కేటాయిస్తారు.

సీబీఎస్ఈ సిలబస్ ద్వారా విద్యాబోధన..

నవోదయ పాఠశాలలో ప్రవేశం పొందిన విద్యార్థులకు సీబీఎస్ఈ సిలబస్ ద్వారా విద్యాబోధన జరుగుతుంది. 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఉచితంగా విద్యనందిస్తారు. చదువుకే పరిమితం కాకుండా ఎన్‌సీసీ, స్పోర్ట్స్ అండ్ గైడ్స్‌లో శిక్షణ ఇస్తారు. కంప్యూటర్ విద్య, క్రీడలు, వ్యాయామ విద్య, యోగా, ఆర్ట్స్‌లో శిక్షణ అందిస్తారు. ప్రముఖ సంస్థలతో జేఈఈ అడ్వాన్స్‌డ్, మెయిన్, నీట్ వంటి జాతీయ పరీక్షలకు ఉచితంగా శిక్షణ అందిస్తారు. అధునాతన డిజిటల్ గ్రంథాలయం, డిజిటల్ తరగతులతో విద్యాబోధన జరుగుతుంది.

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి చర్యలు



విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. విలువలతో కూడిన విద్యనందించడమే మా లక్ష్యం. వారి ప్రతిభా పాటవాలకు అనుగుణంగా మెరుగులు దిద్దుతూ ఉన్నత శిఖరాలు అధిరోహించేలా ప్రణాళికలు ఉంటాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా బాలబాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

బి. పూర్ణిమ, ప్రిన్సిపాల్, జవహర్ నవోదయ, మామునూర్

పరీక్షా విధానం....

ఈ పరీక్షకు ప్రశ్న పత్రం మూడు విభాగాలుగా ఉంటుంది. మేధాశక్తి, గణితం, భాష పరిజ్ఞానం అనే అంశాలపై ఆబ్జెక్టివ్ తరహా ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష 2 గంటల వ్యవధిలో రాయాల్సి ఉంటుంది.

పరీక్ష	ప్రశ్నల సంఖ్య	మార్కులు	వ్యవధి(ని.లలో)
మేధాశక్తి	40	50	60
గణితం	20	25	30
భాష పరీక్ష	20	25	30
మొత్తం	80	100	2 గంటలు

అప్రమత్తంగా ఉండాలి

- ముంపు ప్రాంతాల ప్రజలను ముందే హెచ్చరించాలి
- లోతట్టు ప్రాంతాల వాసులను తరలించాలి
- పునరావాస కేంద్రాలను సిద్ధం చేయాలి
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

హన్మకొండ: భారీ వర్షాలు, వరదలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. గురువారం హనుమకొండ నుంచి రాష్ట్ర మహిళ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని ఐదు జిల్లాల ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, వరంగల్ పోలీసు కమిషనర్, ఎస్పీలతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వం రెడ్ అలెర్ట్ ప్రకటించిందన్నారు. ఈ తరుణంలో గత 24 గంటల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో నమోదవుతున్న వర్షపాతం, వరదలు, లోతట్టు ప్రాంతాల జలమయం, వరద బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, అత్యవసర పరిస్థితుల్లో రెస్క్యూ టీమ్స్ పోషించాల్సిన పాత్ర, టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటును వివరించారు. ఈ సందర్భంగా ఆయా జిల్లాల పరిస్థితి, ముందు జాగ్రత్త చర్యలను ఆయా జిల్లా కలెక్టర్లు.. మంత్రులు ఎర్రబెల్లి , మంత్రి సత్యవతి, ఇతర ప్రజా ప్రతినిధులకు వివరించారు. అనంతరం మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాలో గల జిల్లాల్లో రెడ్, ఆరెంజ్ అలెర్ట్ ఉందని, ప్రజలకు ఏ సమస్య వచ్చినా ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువస్తే వెంటనే అధికారులకు తెలపాలని సూచించారు. నియోజకవర్గ పరిధిలో ప్రజలను అప్రమత్తం చేయాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలు తీసుకోవాలన్నారు. అలాగే, కలెక్టరేట్‌లలో టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలు, శిథిలావస్థలోని ఇళ్లలో నివసిస్తున్న ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలు లేదా పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి తరలించాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు.

వాపును చూసి .. బలుపు అనుకుంటున్న రేవంత్ రెడ్డి

- కర్ణాటక పరిస్థితులు వేరు.. తెలంగాణ పరిస్థితులు వేరు
- రాష్ట్ర మంత్రి సత్యవతి రాథోడ్


విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి సత్యవతి రాథోడ్

సాక్షి, మహబూబాబాద్: కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో బలం లేకపోయినా.. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వాపును చూసి బలుపు అనుకుంటున్నారని, అతనో గజినీలా మాట్లాడుతున్నారని రాష్ట్ర గిరిజన, స్త్రీ, శిశుసంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. గురువారం మహబూబాబాద్ జిల్లాకేంద్రంలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. కర్ణాటకలో కాంగ్రెస్ గెలిచినంత మాత్రాన తెలంగాణలో కూడా గెలుస్తుందని కలలు కనడం హాస్యాస్పదమన్నారు. అక్కడి పరిస్థితులు వేరని, తెలంగాణ పరిస్థితులు వేరని మంత్రి అన్నారు. ఇక్కడ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ప్రజా రంజక పాలన సాగుతుందని, ఇక్కడి పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ఒక్కరిద్దరు కాంగ్రెస్ పార్టీలో చేరినంత మాత్రాన కొంపలు మునుచుకుపోవని, ఆ నాయకులు వెళ్తే బీఆర్ఎస్‌కు నష్టమేమి లేదన్నారు. తెలంగాణ రాకముందు విద్యుత్ పరిస్థితి ఏమిటీ.. తెలంగాణ వచ్చిన తర్వాత విద్యుత్ సరఫరా పరిస్థితి ఏమిటనేది రాష్ట్రంలో ఎవరిని అడిగినా తెలుస్తుందన్నారు. వ్యవసాయానికి 24గంటల ఉచిత కరెంట్ అవసరం లేదని, మూడు గంటలు ఇస్తే సరిపోతుందని రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఆ పార్టీ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. ఇక ముందు రేవంత్ రెడ్డి చౌకబారు ఆరోపణలు మానుకోవాలని అన్నారు. కాంగ్రెస్ గెలిచే చాన్స్ లేదని, మూడోసారి సీఎం కేసీఆర్ గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు.

తెగిన గూడ్స్ రైలు లింక్

- విడిపోయిన బోగీలు
- కేసముద్రం, తాళ్లపూసపల్లి రైల్వేస్టేషన్ల మధ్య ఘటన


రంగాపురంగేట్ సమీపంలో లింక్ తెగిపోవడంతో నిలిచిన గూడ్స్ రైలు

కేసముద్రం: గూడ్స్ రైలు లింక్ తెగిపోవడంతో బోగీలు విడిపోయాయి. ఈ ఘటన గురువారం కేసముద్రం, తాళ్లపూసపల్లి రైల్వేస్టేషన్ల మధ్య జరిగింది. కేసముద్రం రైల్వేస్టేషన్ మీదుగా డౌన్‌లైన్‌లో వెళ్తున్న గూడ్స్ రైలు.. రంగాపురం గేటు సమీపంలో ఒక్కసారిగా లింక్ తెగడంతో బోగీలు విడిపోయాయి. దీనిని గమనించిన గార్డ్.. లోకోపైలట్‌కు సమాచారం అందించాడు. అప్పటికే కొంతదూరం వెళ్లిన గూడ్స్‌ను వెనక్కి తీసుకువచ్చి లింక్‌ను జాయింట్ చేశారు. ఆ తర్వాత యథావిధిగా వెళ్లింది. సుమారు గంట సమయం గూడ్స్ రైలు నిలిచింది.

భారీ వర్షాలపై జాగ్రత్తగా ఉండాలి

- ప్రతి సర్కిల్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు
- టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు


సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు

హన్మకొండ: రాష్ట్రంలో ఎడ తెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నందున విద్యుత్ అధికారులు, ఉద్యోగులు జాగ్రత్తగా ఉండాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్ రావు ఆదేశించారు. గురువారం హనుమకొండలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి 16 జిల్లాల (సర్కిల్) సూపరింటెండెంట్ ఇంజనీర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గోపాల్ రావు మాట్లాడుతూ వర్షాలు తగ్గుముఖం పట్టే పరిస్థితులు కనిపించడం లేదని, ప్రతి సర్కిల్ పరిధిలో 24 గంటలు పని చేసేలా కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలని ఎస్ఈలను ఆదేశించారు. ప్రతి ఉద్యోగి విధిగా హెడ్ క్వార్టర్స్‌లో ఉంటూ సేవలందించాలని సూచించారు. మెన్ అండ్ మెటీరియల్‌ను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఎక్కడైనా అత్యవసర పరిస్థితులు తలెత్తితే వెంటనే స్పందించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. నది పరీవాహక ప్రాంతాలలో విద్యుత్ సంస్థకు ఎక్కువ నష్టం వాటిల్లే ప్రమాదం ఉన్నందున అప్రమత్తంగా ఉంటూ కావాల్సిన, తీసుకోవాల్సిన సత్వర చర్యలు వెనువెంటనే తీసుకోవాలన్నారు. గోదావరి తీర ప్రాంతాలైన భద్రాచలం, భూపాలపల్లి, మంథని పరిసర ప్రాంతాల్లో జాగ్రత్తగా ఉండాలని కోరారు. ట్రాన్స్‌ఫార్మర్ల తరలింపుకు వాహనాన్ని సిద్ధంగా పెట్టుకోవాలన్నారు. ఎస్పీఎం షెడ్లలో ట్రాన్స్‌ఫార్మర్ల రిపేర్లు పెంచుకోవాలని, రోలింగ్ స్టాక్ కూడా సిద్ధంగా ఉంచుకోవాలని కోరారు. ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌కు సంబంధిత సమాచారాన్ని చేరవేయాలని సూచించారు. వినియోగదారులు విద్యుత్ సంబంధిత సమస్యలు, ఫిర్యాదులు టోల్ ఫ్రీ నంబర్ 1800 4250028కు లేదా 1912 కు ఫోన్ చేయాలన్నారు. సమావేశంలో డైరెక్టర్లు వెంకటేశ్వరరావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, పి.మోహన్ రెడ్డి, వి.తిరుపతి రెడ్డి, సీజీఎంలు, 16 సర్కిళ్ల ఎస్ఈలు పాల్గొన్నారు.

కమిషనరేట్‌లో భారీగా పోలీస్ అధికారుల బదిలీ

- పలువురు ఇన్‌స్పెక్టర్లు.. 25 మంది ఎస్సైల బదిలీ
- ఉత్తర్వులు జారీ చేసిన సీపీ



వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధలో ఆరుగురు ఇన్‌స్పెక్టర్లతో పాటు 25 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ శారు.

ఇన్‌స్పెక్టర్లు..

ఇన్‌స్పెక్టర్ల బదిలీలలో జి.సీతారెడ్డి సీసీఆర్‌బీ నుంచి హన్మకొండ ట్రాఫిక్, టి.రవికుమార్ హన్మకొండ ట్రాఫిక్ నుంచి వీఆర్ వరంగల్, ఎస్.సత్యనారాయణ సీఎస్‌బీ వరంగల్ నుంచి వీఆర్ వరంగల్, కె.శ్రీధర్ వీఆర్ వరంగల్ నుంచి సీఎస్‌బీ వరంగల్ (ఎలక్షన్ సెల్), ఎస్.శ్రీనివాస్ వీఆర్ వరంగల్ నుంచి టాస్క్‌ఫోర్స్, ఎ.రాంబాబు సీఎస్‌బీ వరంగల్ నుంచి టాస్క్‌ఫోర్స్‌కు బదిలీ అయ్యారు.

సర్కిల్ పరిధిలో..

రాష్ట్ర వ్యాప్త బదిలీల్లో భాగంగా ఆత్మకూరు ఇన్‌స్పెక్టర్ బండారి కుమార్ వెంకటాపూర్ సర్కిల్‌కు, జి.సదన్‌కుమార్ వర్ధన్నపేట నుంచి సిరిసిల్ల రూరల్ సర్కిల్‌కు బదిలీ అయ్యారు.

సబ్ ఇన్‌స్పెక్టర్లు ఇలా..

కె.సతీశ్ కేయూసీ నుంచి బచ్చన్నపేట ఎస్‌హెచ్‌వో, డి.దేవేందర్ కమలాపూర్ నుంచి ఎస్‌హెచ్‌వో శాయంపేట, జె.పరమేశ్వర్ వీఆర్ వరంగల్ నుంచి ఎస్‌హెచ్‌వో దుగ్గొండి, జే. రాజబాబు వీఆర్ నుంచి మడికొండ , ఎ.సురేశ్ నర్మెట నుంచి కేయూసీ, ఎం.రాజు వీఆర్ నుంచి హసన్‌పర్తి, కె.కిషోర్ హసన్‌పర్తి నుంచి హన్మకొండ, కె.అశోక్‌కుమార్ మిల్స్‌కాలనీ నుంచి హసన్‌పర్తి, ఎండీ వలీ వీఆర్ నుంచి పీసీఆర్, చింతరాజు వీఆర్ నుంచి నర్మెట, బి.కరుణాకర్ పీసీఆర్ నుంచి కమలాపూర్ , సీమాఫ్రర్‌హీన్‌వీఆర్ నుంచి కమలాపూర్ , చరణ్‌కుమార్ వీఆర్ నుంచి నర్సంపేట, బొజ్జా రవీందర్ నర్సంపేట నుంచి పరకాల, టి.ప్రశాంతిబాబు పరకాల నుంచి పీసీఆర్ అటాచ్డ్ ఐటీసెల్, డి.రాజు వీఆర్ నుంచి టాస్క్‌ఫోర్స్, తౌటం శ్రవణి వీఆర్ నుంచి మిల్స్‌కాలనీ, నాగరాజు సాయి దివ్య వీఆర్ నుంచి సుబేదారి మహిళా పోలీస్ స్టేషన్, బి.నవిత వీఆర్ నుంచి అర్బన్ మహిళా పోలీస్ స్టేషన్, గడ్డం ఉమా హన్మకొండ నుంచి వీఆర్, నిస్సార్‌పాషా వీఆర్ నుంచి టాస్క్‌ఫోర్స్, కె.శ్రీకాంత్ వీఆర్ నుంచి సీఎస్‌బీ వరంగల్, బి.హరికృష్ణ వీఆర్ నుంచి మిల్స్‌కాలనీ, పి.రవి సుబేదారి మహిళా పోలీస్ స్టేషన్ నుంచి వరంగల్ ట్రాఫిక్, భూక్య చందర్ కేయూసీ నుంచి వీఆర్‌కు వరంగల్‌కు బదిలీ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు.

నిత్యావసరాలకు టెండర్ల ఆహ్వానం

- ఐటీడీఏ పీఓ అంకిత్

ఏటూరునాగారం: 2023–2024 విద్యా సంవత్సరానికి సంబంధించి ములుగు, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, హనుమకొండ, జనగామ, వరంగల్ జిల్లాలో ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో కూరగాయలు, గుడ్లు, పండ్లు, పాలు, పెరుగు, చికెన్ సరఫరాకు టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ అంకిత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. క్లస్టర్, మండలాల వారీగా పాఠశాలలకు సరఫరా చేయడానికి సీల్డ్ టెండర్లు ఆహ్వానిస్తున్నామన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన వారు సెక్యూరిటీ డిపాజిట్ కింద రూ. 30వేలు, ఈఎండీ, టెండర్ ఫామ్‌ల ఖరీదు రూ.5వేలు డిమాండ్ డ్రాఫ్ట్ మాత్రమే ×డిప్యూటీ డైరెక్టర్ (టీడబ్ల్యూ), ఐటీడీఏ ఏటూరునాగారం₹ పేరున తీసి డీడీని ఐటీడీఏలోని డీడీ కార్యాలయంలో ఈనె 21 నుంచి 31వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు అందించాలన్నారు. స్వీకరించిన సీల్డ్ టెండర్ ఫామ్‌లను ఆగస్టు 4వ తేదీన సాయంత్రం ఐటీడీఏలో ఓపెన్ చేస్తామన్నారు.

కేసీఆర్‌వి అబద్ధపు హామీలు

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్


పంచాయతీ కార్మికుల సమ్మె శిబిరం వద్ద మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్


స్టేషన్‌ఘన్‌పూర్: వచ్చే ఎన్నికల్లో లబ్ధిపొందడం కోసమే డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లు, రూ.3లక్షలు అంటూ సీఎం కేసీఆర్ అబద్ధపు హామీలు ఇస్తున్నారని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మేరకు గురువారం జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులకు నెలనెలా వేతనాలు ఇవ్వలేని కేసీఆర్.. రూ.3లక్షలతో పేదలకు ఇళ్లు కట్టిస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎన్నికల్లో ఓట్ల కోసం బీజేపీ, బీఆర్ఎస్ బీసీ కులస్తుల జపం చేస్తున్నాయని ఆరోపించారు. దేశంలో బీసీ ప్రధానిగా చెప్పుకునే నరేంద్రమోదీ బీసీ జనాభాను లెక్కించడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారన్నారు. మల్కాపూర్ రిజర్వాయర్‌లో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లించడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని, వెంటనే రిజర్వాయర్‌ను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. స్టేషన్‌ఘన్‌పూర్ ప్రాంతంలో లెదర్ ఇండస్ట్రీ, టెక్స్‌టైల్ పార్కును పూర్తి చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు.

పంచాయతీ కార్మికుల సమ్మెకు మద్దతు..

స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద 15రోజులుగా జీపీ కార్మికులు సమ్మె చేస్తున్న విషయం తెలుసుకున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు మాసగల సిద్దయ్య, జిల్లా ఇన్‌చార్జ్ నీర్మాల రత్నం, నియోజకవర్గ ఇన్‌చార్జ్ తాళ్లపెల్లి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన కల్పించాలి

- అదనపు కలెక్టర్ మహేందర్‌జీ


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మహేందర్‌జీ

హన్మకొండ అర్బన్: ఈవీఎం, వీవీ ప్యాట్‌ల ద్వారా ఓటు వేయడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ మహేందర్‌జీ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈవీఎం, వీవీ ప్యాట్‌ల ప్రదర్శన కేంద్రాన్ని అదనపు కలెక్టర్ మహేందర్‌జీ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈవీఎం, వీవీ ప్యాట్‌ల ద్వారా ప్రతీ ఒక్కరికి ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ ఎస్.కిరణ్‌కుమార్, సూపరింటెండెంట్ ఎం.జ్యోతి వరలక్ష్మిదేవి, పార్టీల ప్రతినిధులు శ్రీనివాస్, శ్యాంసుందర్, జయపాల్‌రెడ్డి, నాగవల్లి రజనీకాంత్, సయ్యద్ ఫయాజుల్లా, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్

హన్మకొండ అర్బన్: జిల్లా అదనపు కలెక్టర్‌గా సీహెచ్.మహేందర్ జీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణి నుంచి ఆయన బాధ్యతలు అందుకున్నారు. ఈసందర్భంగా వివిధ శాఖల అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం మహేందర్‌జీ.. కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందించారు. అలాగే హనుమకొండ ఆర్డీఓగా ర మేశ్, పరకాల ఆర్డీఓ శ్రీనివాస్ గురువారం బాధ్యతలు స్వీకరించి కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

భద్రకాళి దేవాలయంలో పూజలు

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయాన్ని గురువారం హనుమకొండ అడిషనల్ కలెక్టర్ సీహెచ్ మహేందర్‌జీ సందర్శించారు. పూజల అనంతరం ఆలయ మహా మండపంలో వేదపండితులు ఆయనకు మహదాశీర్వచనం అందించారు. మహేందర్‌జీ వెంట వరంగల్ ఆర్డీఓ వాసుచంద్ర ఉన్నారు.

సోషియాలజీ విభాగాధిపతి కొనసాగింపు


అయిలయ్య

కేయూ క్యాంపస్: కేయూ సోషియాలజీ విభాగం అధిపతిగా ఆ విభాగం ఆచార్యులు కుంట అయిలయ్యను కొనసాగిస్తూ గురువారం రిజిస్ట్రార్ టి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. సోషియాలజీ విభాగం అధిపతిగా ఆయన రెండేళ్లకుపైగా కొనసాగుతున్నారు. ఆయన పదవీకాలం ముగియడంతో ఆయననే కొనసాగిస్తూ అంటిల్‌ఫరదర్ ఆర్డర్స్‌తో ఉత్తర్వులు జారీచేశారు.

బాలికపై లైంగికదాడి?

- వ్యక్తిపై కేసు నమోదు?

నెల్లికుదురు: ఓ బాలికపై లైంగికదాడికి పాల్పడిన ఓ వ్యక్తిపై గురువారం మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు పోలీసులు కేసు నమోదు చేసినట్లు సమాచారం. మండలంలోని తారాసింగ్ బావి తండాకు చెందిన వ్యక్తి.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై లైంగికదాడికి పాల్పడినట్లుతెలిసింది. ఈ ఘటనపై బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు సదురు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సమాచారం.